# నవజీవనం

కె.వి.యస్. వర్మ

ఆ యిల్లు విషాదంలావుంది. ఆ యింట్లోని మనుషులు నిరాశతో వచ్చే నిట్టూర్పుల్లా వున్నారు.

అరగంటక్రితం ఆ యిల్లు ఏ ఆలోచనాలేని మెదడులా వుంది. సుభద్రి అత్తవారింటినుంచి నాలుగు మైళ్లు నడిచి నడిచి వస్తూ వస్తూ బోలెడు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది. సుభద్రి తల్లీ తండ్రీ తమ్ముడూ తలోకాస్త విషాదాన్ని పంచుకున్నారు.

పదిహేను నెలలక్రితం సూర్యానికి హైదరాబాద్‌నుంచి ఇంటర్వ్యూ 'వుద్యోగం' ఆశచూపిస్తూ వచ్చింది. వెళ్దామంటే డబ్బులేదు. మానేద్దామంటే మొదటి ఇంటర్వ్యూ కావడంవల్ల మనసు వొప్పలేదు. ఏడుమైళ్లు డొక్కు సైకిలుమీద కాలేజికి వెళ్ళి మరీ చదివాడు బి.ఏ. వరకూ. రెండేళ్ళనుంచి ఖాళీగా వున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో సుభద్ర యిక్కడేవుంది. ఇంట్లోని పరిస్థితిచూసి, తన పెళ్ళినాడు పెట్టిన బంగారు గాజులజతా తీసి, తమ్ముడికిచ్చింది. తాకట్టుపెట్టి డబ్బు తెమ్మంది. సూర్యం పట్నంవెళ్ళి గాజులు తాకట్టుపెట్టేడు. నూటయాభై రూపాయలు పట్టుకొచ్చాడు.

సూర్యం ఖుంటి ఖర్చులకు యాభై రూపాయలిచ్చి సర్టిఫికేట్లూ, వంద రూపాయలూ పట్టుకుని హైదరాబాదు వెళ్ళేడు. అయిదురోజులకి తిరిగి వచ్చాడు. ఉద్యోగం సంపాదించికాదు— ఉత్త చేతులతో.

రోజులు గడుస్తున్నాయి. సూర్యం ఉద్యోగప్రయత్నాలు చేస్తున్నాడు. ఎంప్లాయ్‌మెంటు ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు.

ఆకాశం నీలంగా వుంటూనేవుంది. వర్షం కురుస్తూనేవుంది. వెన్నెల వెండిలా మెరిసి పోతూనేవుంది. ఎండ నిప్పుల్ని వూదుతోనేవుంది మార్వాడీకొట్లో వడ్డీ పెరిగిపోతూనేవుంది.

జరిగిపోయిన కథలోంచి జరుగుతున్న కథలోకివస్తే—

సుభద్రికీ వాళ్ళ అత్తగార్కీ ఈ మధ్య పడకపోవడంవల్ల గొడవ వచ్చిపడింది. సుభద్రిని ఎలా రాచి రంపాన పెట్టాలా అని ఆలోచిస్తున్న అత్తగారికి తటుక్కున ఆలోచన రానేవచ్చింది. సుభద్రిని గాజులేంచేసేవని అడిగింది. సుభద్రి నిజాన్ని నిర్భయంగా చెప్పింది.

సుభద్రి అత్తగారు గట్టిగా అరిచింది. మాదంతా దోచేసి మీ పుట్టింటికి తరలించేస్తున్నావంది. ఇలాగైతే మా యిల్లు గుల్లయిపోతుంది అంది. తక్షణం పోయి గాజులు పట్టుకొస్తేనే యింట్లోకి రానిచ్చేదంది. సుభద్రిని బయటకు గెంటేసింది.

భర్త యింట్లో లేకపోవడంవల్ల, సుభద్రి నాలుగు మైళ్ళు నడిచి నడిచి వస్తూ బోల్డు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది.

"నువ్వొస్తుంటే మీ వారేమీ మాట్లాడలేదా"

"ఆయన ఊళ్ళోలేరమ్మా"

"యిదంతా నాగురించే జరిగింది" అన్నాడు సూర్యం బాధపడుతూ.

"ఇప్పుడేం అనుకుంటే ఏంలాభం: ధాన్యం షావుకారి దగ్గరకు వెళ్ళివస్తామండు"అని సుభద్రి తండ్రి వీధిలోకి నడిచాడు.

తిన్నగా ధాన్యం షావుకారి దగ్గరకు వెళ్ళేడు. పరిస్థితి చెప్పుకున్నాడు. కోతలు కోయగానే ధాన్యం తూగేస్తానన్నాడు. ఎలాగైనా డబ్బు సర్దమన్నాడు. షావుకారు మొదట, ధాన్యం తూయకుండా డబ్బివ్వనన్నాడు. ఆఖరికి, ధాన్యం తూసేటప్పటికి వుండేధరకి, బస్తాకు మూడురూపాయలు తగ్గించి యిచ్చాడు. రెండొందలు తీసుకుని, యింటికి వచ్చి, సూర్యానికి యిచ్చాడు. గాజులు విడిపించుకుని రమ్మన్నాడు.

సూర్యం బట్టలు మార్చుకుని బయల్దేరాడు.

పంచాయతీబోర్డు రేడియోనుంచి కార్మికుల కార్యక్రమం ప్రసారమవుతోంది. ఒక కార్మికునితో ఇంటర్వ్యూ.

"నువ్వు పన్జేసే కార్ఖానాలో పని కష్టంగా వుంటుందా? సులభంగా వుంటుందా"

"సులభంగానే వుంటుందండి"

"ప్రతినెలా జీతాలు సక్రమంగా యిస్తారా"

"మొదటి తారీఖునే యిచ్చేస్తారండి"

"నీకిచ్చే జీతం సరిపోతుందా"

"సరిపోకేమండి. ఇంకా మిగులుతుందికూడా"

వింటున్న సూర్యానికి నవ్వొచ్చింది. "మిగిలింది ఏం చేస్తావు" అనే ప్రశ్నా "వడ్డీకిచ్చుకుంటానండి"అనే జవాబుకూడా ప్రసారంచేస్తే ఇంకా బావుండుననుకున్నాడు.

ఊరు దాటేడు. ఒక మైలు నడిచాడు. దోనేమీద కాలువదాటేడు. మరో రెండు ఫర్లాంగులు నడిచాడు, బస్సుకోసం చూస్తూ నిలబడ్డాడు. బస్సు వచ్చింది. ఎక్కాడు. ఒక గంట గడిచింది. బస్సు పట్నంలోకి బాణంలా దూసుకుపోయి, పంతెనకి దిగువగా ఆగింది.

సూర్యం బస్సు దిగేడు.

"బాబూ. కారులోంచి పడిపోయానండి. ధర్మం చెయ్యండి" పదిహేనేళ్ళకుర్రోడు అడుక్కుంటున్నాడు.

సూర్యం అతన్ని చూసేడు. వాడిదివరకు ఈ బస్సులోనే క్లీనర్‌గా పన్జేసేవాడు. బస్సునిండా జనాన్ని ఎక్కించేసి, తను తలుపు పట్టుకుని వేలాడేవాడు. అలా యజమానికి లాభాలు పెరగడానికి తోడ్పడేవాడు. పాపం, ఎప్పుడు పడ్డాడో బస్సులోంచి పడ్డాడు కాలు పచ్చడై పోయింది. క్లీనర్ వుద్యోగంపోయింది. అడుక్కునే వుద్యోగం వచ్చింది.

సూర్యం హృదయం ద్రవించి పోయింది. మేన్‌రోడ్డుమీద నడుస్తున్నాడు. కాళ్ళకి జోళ్లులేవు. నిప్పుల దారిమీద నడుస్తున్నట్టుంది. ఎండ వేడిగా కాస్తూంది. వెల్‌కమ్ హోటల్ దగ్గరికి వచ్చేడు. "ఆపదమొక్కులవాడా, ఓ శ్రీనివాసా" అని పాడుతూ హోటల్‌ముందు కూచుని అడుక్కుంటున్నాడొకడు.

వేగంగా నడుస్తూ సూర్యం, నాలుగురోడ్ల సెంటరుదగ్గర ఆగేడు. కుడిపక్కకి తిరిగేడు. నాలుగడుగులు వేసేడు. "శేఠ్..." బోర్డుచూసేడు. లోపలికి వెళ్ళేడు.

మెత్తని పరుపుమీద తలకింద చెయ్యిపెట్టుకుని పడుకున్నాడు మార్వాడీ నాటకాల కృష్ణుడిపోజులో. మార్వాడీ బంగారు రంగులో పండిన అమృతపాణీ అరటి పండులా వున్నాడు. నుదుట చిన్నబొట్టువుంది.

మార్వాడీ సూర్యాన్నిచూసి, లేచి, గోడకి జారబడ్డాడు.

"ఏం కావాలి"

"మీదగ్గర జత బంగారుగాజులు సంవత్సరంక్రితం తాకట్టు పెట్టేను. విడిపించుకోమని మీదగ్గర్నించి లెటరుగూడా వచ్చింది. తీసుకుపోదామని వచ్చేను."

"ఎంతకు పెట్టేవు"

"నూటయాభైకి"

మార్వాడీ తన గుమస్తావంక చూసేడు. గుమస్తా రెండు చెక్కలమధ్య కట్టిన కాగితాల్ని తీసి, వెదికి, ఒక కాగితం మార్వాడీకిచ్చాడు. మార్వాడీ గుమస్తాని లెక్క కట్టమని చెప్పి, యినుపబీరువాదగ్గరకెళ్లాడు. ఒక సొరుగులాగి, అందులోనివస్తువుల్ని వెదికి, బంగారు గాజులజత తీసేడు. ఆ గాజులకి కట్టిన చీటీ తీసేడు.

294

"పదహారు నెలలయ్యింది. వడ్డీ యాభై నాలుగు రూపాయలు" అన్నాడు మార్వాడీతో గుమస్తా.

"యాభైనాలుగు రూపాయలెలా అయ్యింది? పదహారునెలలు ఎలాఅయ్యింది? చీటీ ఒకసారి చూడండి. పదిహేను నెలలే అయింది. ఇదుగో. ఇందులోవేసిన తారీఖు ప్రకారం పదిహేనునెల్లే అయింది. నెలకీ నూటికీ రెండురూపాయల వడ్డీ చొ॥న నూట యాభైకి మూడురూపాయలు. పదిహేనునెలలకి నలభైఐదు"

"మీలెక్కకీ మాలెక్కకీ ఒకనెల తేడావస్తుంది. తర్వాత వడ్డీకి వడ్డీకడతాం."

"మీకోలెక్కా మాకోలెక్కా ఎలా వుంటుంది. వడ్డీకి వడ్డీకడతామని ముందే ఎందుకు చెప్పలేదు."

"ఆ అవసరం మాకులేదు. ఇంతకీ తీసుకువెళ్లేదేరమేనా"వ్యంగ్యంగానవ్వుతూ మార్వాడీ.

సూర్యం కళ్ళకి మార్వాడీ అసహ్యంగానే కాకుండా కలుపుమొక్కలాగకూడా కనిపించాడు.

ఇద్దరూ కొంచెంసేపు వాదించుకున్నారు. ఇద్దరిలెక్కకీ వున్నతేడా తెగలేదు. అన్యాయంగా అనవసరంగా మార్వాడీకి ఎందుకు ఎక్కువ యివ్వాలనుకున్నాడు సూర్యం.

"న్యాయంగా తారీకుప్రకారం వడ్డీ నలభైఐదూ, అసలు నూటయాభై మొత్తం నూటతొంభైఅయిదూ యివిగో"అని ఎదురుగావున్న బల్లమీద పెట్టేడు సూర్యం.

"మిగతా తొమ్మిదీ ఏవి?"

"అవి యివ్వనవసరంలేదు. గాజులిలాయియ్యి"

"ఇవ్వను"

"ఎందుకివ్వవూ"

"ఎందుకివ్వాలి"

సూర్యం మార్వాడీదగ్గరకెళ్ళేడు. అతని చేతుల్లోని గాజులు లాక్కున్నాడు. గుమ్మం దాటబోయాడు. మార్వాడీ సూర్యం కాలరు పట్టుకున్నాడు.

"నక్సలైటులావున్నావే! గాజులు పట్టుకుపోదామనే"

"ముందు కాలరొదులు. నీకు రావలసింది నీకు ముట్టిందిగా"

మార్వాడీ సూర్యం చేతిలోని గాజులు లాక్కోబోయాడు. సూర్యం మార్వాడీని బలంగా తోసేడు. మార్వాడీతల గుమ్మానికి తగిలింది. నుదురు చిట్లింది. రక్తం కారింది రక్తాన్నిచూసి మార్వాడీ గజగజవణికాడు.

పక్కకొట్లుల్లోంచి కొంతమంది వచ్చేరు. సూర్యాన్ని పట్టుకున్నారు. గుమస్తా సిగ్గుతో తలవంచుకుని నిలబడ్డాడు. మార్వాడీ వణుకుతూ చెప్పగా, గుమస్తా పోలీస్ స్టేషన్కి ఫోన్ చేసేడు.

* * *

రోడ్డు బ్లాక్ కలర్ పేపర్‌లావుంది. సూర్యం నడుస్తున్నాడు. అటూ యిటూ చూస్తూ నడుస్తున్నాడు. అంతా బిజీగా వున్నారు.

హోటల్స్‌దగ్గరా కిళ్ళీబడ్డీలదగ్గరా ఒక్క ముష్టివాడుకూడా లేడు.

సూర్యం బస్ స్టేండ్‌దగ్గరకొచ్చాడు. తిరుపతిగుండుకానీ అన్నవరం గుండుకానీ కనిపించలేదు. సూర్యం ఆశ్చర్యపోతూ ముందుకు నడిచాడు.

ఎక్కడా ఎవరూ ఏం చదివేవనీ, ఏంచేస్తున్నావనీ ఎవర్నీ అడగడంలేదు. నీ కులం ఏవిటని అడగడంలేదు. నీ వృత్తేవిటని అడుగుతున్నారు. ఏం ఉద్యోగం చేస్తున్నావని అడుగుతున్నారు.

సూర్యం నడుస్తూ దేవాలయందగ్గరికి వచ్చాడు. కొంతమంది బయటకువచ్చారు. వాళ్ళ ముఖాల్నిబొట్లు లేవు. చెవుల్లో పువ్వుల్లేవు. వాళ్ల దేవాలయంమీది శిల్పాల గురించీ, శిల్పుల ప్రతిభ గురించీ మాట్లాడుకుంటున్నారు. సూర్యం సంభ్రమంగా వాళ్ళని చూసేడు.

పక్కరోడ్‌మీదకు తిరిగాడు. కుడిచేతివేపున 'బొమ్మల పరిశ్రమ' బోర్డు కనిపించింది.

ఒకడు మట్టితో బొమ్మలు చేస్తున్నాడు. సూర్యం వాడ్ని పరీక్షగా చూసేడు. వాడిదివరకు వెల్‌కమ్ హోటల్‌దగ్గర "ఆపదల మొక్కులవాడా ఓ శ్రీనివాసా" అని పాడుతూ అడుక్కునేవాడు. వాడిప్పుడు బొమ్మలుచేస్తూ "ఏరువంటే కొందరికి భయం భయం– పసిపిల్లలు వారికన్న నయం నయం" అని పాడుకుంటున్నాడు ఉత్సాహంగా. మరొకడు బొమ్మలకు రంగులు వేస్తున్నాడు. అతన్ని సూర్యం పరిశీలనగా చూసేడు. అతనింతకుముందు రోడ్డుమీద బొమ్మలువేసి, అడుక్కునేవాడు. అతని చేతిలోని బొమ్మను చూసేడు సూర్యం. అతనప్పుడు ఆ బొమ్మ కళ్ళల్లో ఎర్రజీవల్ని చిత్రిస్తున్నాడు. సూర్యం మిగతా బొమ్మల్ని చూసేడు.

ఆ బొమ్మల్లో ఏ దేవుడిబొమ్మా లేదు. సమాజాన్ని ప్రతిబింబించే బొమ్మలున్నాయి– చైతన్యవంతంచేసే బొమ్మలున్నాయి.

సూర్యం అక్కడనుంచి ముందుకు నడిచాడు. అక్కడింతకుముందువుండే పూరి గుడిసెలులేవు. మురికిలేదు అందంగా సింపుల్‌గా యిప్పుడక్కడ పెంకిటిళ్లున్నాయి. వాకిళ్ళు యిస్త్రీచేసిన తెల్లదుప్పట్లలా వున్నాయి. డొక్కలెండి ఆకలికళ్ళతో అడుగడుగునా కన్పించే వాళ్ళెవరూ లేరు. ప్రతి మనిషి యాపిల్‌పండులా వున్నాడు. ప్రతి ముఖం తృప్తిగా వుంది.

సూర్యం సంతోషంగా నడుస్తున్నాడు. ఎడమచేతివేపున వుండాల్సిన 'ఎంప్లాయ్‌మెంటు' ఆఫీసు కనిపించలేదు. బిల్డింగ్ మాత్రం వుంది. బోర్డ్ లేదు. అటువేపే వస్తున్నవాణ్ని ఆపి, ఇక్కడి ఆఫీసు ఏమైందని సూర్యం అడిగాడు. అతను సూర్యాన్ని అదోలాచూసి "యింకా ఎంప్లాయ్‌మెంటాఫీసెందుకు? చదువునీబట్టీ, అతని ఇంటరెస్ట్‌ని బట్టీ, పాసైన సర్టిఫికేట్ మీద ఫలానా ఉద్యోగం అని రాసిస్తారు. వెళ్ళి జాయినయిపోవడమే" అన్చెప్పి, అతను తనదారిన తను వెళ్ళిపోయాడు.

సూర్యం నడుస్తున్నాడు. నడుస్తున్నాడు. ఒక కార్ఖానాదగ్గర ఆగాడు. యూనిఫార్మ్‌లో వున్న కుర్రోళ్లు కార్మికులతో కలిసి పనిచేస్తున్నారు. చాలా ఉత్సాహంగా సరదాగా పనిచేస్తున్నారు. సూర్యం కళ్ళు పెద్దవి చేసుకుని చూసేడు. 'ఇదేమిట'ని ఒక కార్మికుణ్ణి అడిగాడు సూర్యం. అతను నవ్వుతూ చెప్పేడు "వీళ్ళందరూ కాలేజీల్లోనూ హైస్కూళ్ళల్లోనూ చదువుకుంటున్నారు. ఐతే, వారానికోసారి కార్ఖానాలకి వస్తారు. మా దగ్గర పనినేర్చుకుంటారు. దీనివల్ల కష్టం అంటే ఏమిటో తెలుస్తుంది. శ్రమజీవిమీద గౌరవం పెరుగుతుంది."

సూర్యం హుషారుగా చలాకిగా వేగంగా నడుస్తున్నాడు. పట్నం దాటేడు. పొలాల్ని దమ్ము చేస్తున్నారు. యూనిఫార్మ్‌లోవున్న విద్యార్థులు వస్చేస్తున్నారు. యువకులతోనూ పెద్దవాళ్ళతోనూ కలిసి కేరింతాలు కొడుతూ వస్తేస్తున్నారు. సూర్యం 'యిదేమిట'ని అడుగుదామనుకున్నాడు. అర్థం అయ్యింది. "శ్రమకు ఎంతవిలువ వుందో!" అనుకున్నాడు.

అతనికి ఆనందం అధికం కావడంవల్ల కాళ్లు గాలిలో తేలిపోతున్నాయి. మనసు తెగమురిసిపోతోంది. సంతృప్తివల్ల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

*　　　*　　　*

మూడు గంటలు ఠంగ్ ఠంగ్‌మని బరువుగా మోగేయి. సూర్యానికి మెలకువ వచ్చింది. ఒళ్ళు విరుచుకున్నాడు. లేచి నిలుచున్నాడు. మార్వాడీ మనసులా నల్లగా వుంది రాత్రి. సూర్యం కళ్ళు మూసుకున్నాడు. కల గుర్తుకు వచ్చింది. అతని మేను పులకించి పోయింది.

"అమ్మా వసుమతీ కన్నతల్లీ! నీ వొంటిమీద భయంకరంగా మొలిచిన వ్రణాలకి ఆపరేషన్ చేసి, నీ బాధని పూర్తిగా పోగొట్టగలమా? నీ ముఖంమీద పచ్చని చిన్నవ్వును ఎప్పటికైనా జూడగలమా? కులమతాలూ ఎక్కువ తక్కువలూ ఆకలీ దోపిడీ లేని మరో ప్రపంచాన్ని సృష్టించుకోగలమా? నేనుకన్న స్వప్నాన్ని సత్యం చేసుకోగలమా? స్వేచ్ఛల సంతృప్తుల సమతా జీవనాన్ని సాగించగలమా?"

297

సూర్యానికి మరి నిద్రరాలేదు. రాత్రికి కాపలా కాస్తూనేవున్నాడు. ఆలోచనలకు పదును పెడుతూనేవున్నాడు.

తెల్లవారింది. సూర్యం కటకటాల్లోంచి బయటకు చూస్తున్నాడు.

ఇంతలో—

జైలు గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక వ్యక్తిని లోపలికితోశారు. తలుపులు మూసుకున్నాయి.

సూర్యం ఆ కొత్త మనిషిని పరికించి చూశాడు. కొద్దిగా మాసినగడ్డం. కష్టించి పనిచేసేవాడని తెల్పుతూ కండలు తిరిగిన చేతులు. పంచె. బనీను. ముప్పై ఏళ్లపైగా వుండొచ్చు.

"నిన్నెందుకు తీసుకొచ్చారిక్కడికి?"

"ఎందుకేటి. బుగతని నరికేసేను."

"ఏం"

"సిన్నప్పట్నించీ ఆడిదగ్గర పనిసేత్తన్నాను. ఒకపూట తినీ, తినకా, నాజీతం డబ్బుల్లోంచి కొంచెం కొంచెం మిగిల్చి, ఆడిదగ్గర దాత్తన్నాను. ఎందుకని అడగవేం? నా కూతురి మనువు సేద్దారని; మొన్నదానికి మనువు కుదిర్చేను. బుగతదగ్గరికెళ్ళి, నేన్దాచుకున్న డబ్బిమ్మన్నాను. డబ్బేటన్నాడు. నువ్వు దాయటమేటిరాఎదవా అన్నాడు. బతిమాలేను. నా డబ్బు నాకిచ్చీమని ఆడికాళ్ళమీదపడ్డాను. ఆడు ఛీఛీ పోరా యెదవా అని గెంటీసీడు. నాకింక ఒళ్ళు కిందా మీదా తెలలేదు. అప్పుడే పచ్చగడ్డికోసి, దూళ్ళకి పడేసివచ్చేనేమో. కొడవలి చేతిలోవున్నది. దాంతో ఆ నంజికొడుకుని నరికేసేను. సచ్చేడోనేదో తెలీదనుకోయింకా."

సూర్యం కళ్ళు తళతళా మెరిసేయి. అతను తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. అతని గుండెకి కొండంతబలం వచ్చింది అతని మెదడులో ఆలోచనలు ఆనందంగా ఆడుకుంటున్నాయి.

అరుణారుణకిరణాలు ప్రతి యిసుకరేణువునీ తాకుతున్నాయి. ఆకలికి మలమల మాడుతున్నవాళ్ళు... అన్యాయాలకు ఆహుతి అవుతున్నవాళ్ళు... యింకా శాంతంగా వుంటారా... యింకానా... యింకానా...

---

బీహార్‌లో విద్యార్థుల ఆందోళనకు బాసటగా పాట్నాలో ఐదుగురు కవులు, సాహిత్యవేత్తలు సుప్రసిద్ధ కళాకారుడు దామోదర్ అంబస్తా 12 గంటలు నిరాహారదీక్ష చేసారు. 'తీస్రీఖసం' అనే గ్రంథానికి సాహిత్య అకాడమీ అవార్డ్ పొందిన ఫణీశ్వర్‌నాథ్ రేణు కూడా యీ నిరాహారదీక్ష చేసినవాళ్ళలో వున్నాడు.

298